మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక

4.2.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 286 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


## తారాజువ్వలా ఇషాన్ కిషన్




గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్

టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?

అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్

.. వివరాలు 7లో

# ప్రతిష్ఠాత్మకంగా మునిసిపోల్స్

## అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలి



సర్వేల్లో 90 శాతం కాంగ్రెస్‌కే సానుకూలం..

ఇన్‌చార్జి మంత్రులు అందర్నీ కలుపుకొని వెళ్లాలి..

రెండ్రోజులకోసారి జూమ్‌లో భేటీ

మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి..

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్ష

వార్డుల్లో బీసీలకు 56శాతం ఇచ్చినట్లు లెక్క..

రెబెల్ అభ్యర్థులు 2శాతం లోపేనని గుర్తింపు

**జనతా న్యూస్, హైదరాబాద్ :** మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులు మాత్రమే సమయం ఉందని.. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలోనే ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. నాయకులను సమన్వయం చేసుకోవాలని, అందరూ ఐకమత్యంగా పనిచేయాలని మంత్రులకు స్పష్టం చేశారు. మంత్రులు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నాయకులను సమన్వయం చేసుకొని, ముందుకెళ్లాలని తెలిపారు. తాజా సర్వేల ప్రకారం మునిసిపాలిటీల్లో 90 శాతం మేరకు కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో మంత్రులతో మునిసిపల్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లు

మిగతా 2 లో



## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు

.. వివరాలు 3లో

## మన సహనమే విజయానికి బాట

విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

ఎన్డీఏ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపీలు



4

ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను నియమించుకోవచ్చు!

కొత్త నియామకాలకు పాత ఆదేశాలు అడ్డంకి కాదు..

మంత్రివర్గ సిఫారసులపై గవర్నర్ స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చు

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై సుప్రీం స్పష్టత

.. వివరాలు 2లో

## రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ

రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్

2

రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.




## ట్రంప్ ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు



మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు

ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది

అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు

4

## రైతుల అవసరాల మేరకు రైతు నేస్తం కార్యక్రమం



రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి తుమ్మల


యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు.

2




## దేశ గోప్యతను అడ్డుకోలేరు

వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ

చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

.. వివరాలు3లో



## భారత్.. రష్యా వ్యూహాత్మక భాగస్వామి

చమురు దిగుమతులపై చర్చ జరగలేదు

చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం

డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా

.. వివరాలు 3లో

## రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు

లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా



4

ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు.

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

ఉచితాలను ప్రకటించడానికి కాదు

3

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



# రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ

## రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

## ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ఫిబ్రవరి3 :** రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి మరియు రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చు. ఈ చొరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు మరియు తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుంది.ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..విద్యార్థులకు తల్లిదంత్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి ఈరోజు రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్ ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించి కారణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు.ఇది ఆ÷–లనైన్ లో క్షేత్ర స్థాయి-ంలో ప్రతి మోటార్ వెహికిల్ ఉన్న వారి దగ్గరకు తీసుకుపోయి రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలో తీసుకుపోవాలి.కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య,రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పె÷–టటెం తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అవసరాల మేరకు రైతు నేస్తం కార్యక్రమం

## రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి తుమ్మల

## యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

## ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్ల,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

## విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

# ప్రతిష్ఠాత్మకంగా మునిసిపోల్స్

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు తాము బాధ్యులుగా ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పార్టీ బలాలు, బలహీనతలు, అభ్యర్థుల వివరాలు, గెలుపు అవకాశాలతో కూడిన సమగ్ర నివేదికలను అందజేశారు. అదే సమయంలో సీఎం రేవంత్ తాజా సర్వే వివరాలనూ తెప్పించారు. నివేదికలన్నింటినీ సమీక్షించిన అనంతరం.. 90 శాతం మునిసిపాలిటీల్లో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందన్న అంచనాకు వచ్చారు. పార్టీ గుర్తుపై జరిగే ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లతో పాటు సొంత జిల్లాల్లోని నేతలనూ సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మంత్రులు, పార్టీ యంత్రాంగం వారం రోజులూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేయాలని ఆదేశించారు. పలు మునిసిపాలిటీల్లో నేతల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రులకు సూచించారు. ఓట్లు చీలకుండా చూసుకునే బాధ్యతను మంత్రులు, స్థానిక నాయకులు తీసుకోవాలని చెప్పారు. కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకొని, గెలిపించే బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని అన్నారు.

వారం రోజులూ మునిసిపల్ ఎన్నికలపైనే దృష్టి పెట్టి పనిచేయాలని చెప్పారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లు; ఆదిలాబాద్, మెదక్ మునిసిపాలిటీల్లో మరింత శ్రమించాలని సూచించారు. ఇకపై రెండురోజులకోసారి జూమ్ ద్వారా సమావేశమై సమీక్షించుకుందామని తెలిపారు. కాగా, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా వార్డులు, డివిజన్లలో దాదాపు 56 శాతం మేరకు బీసీలకే కేటాయించినట్లు సమీక్షలో లెక్క తేల్చారు. అలాగే ఈ



ఎన్నికల్లో రెబల్స్ బెడదను కనిష్ఠ స్థాయికి తగ్గించినట్లుగా గుర్తించారు. ఈ సమస్య 1-2 శాతం మధ్యలోనే ఉంటుందని తేల్చారు. టీపీసీసీతో సమన్వయం చేసుకొని, ఆ మాత్రం కూడా లేకుండా చూడాలని సీఎం రేవంత్ మంత్రులకు సూచించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లు హాజరు కాలేదు. వారు జిల్లా పర్యటనలో ఉన్నందున రాలేకపోయారని, వారితో ఫోన్‌లో మాట్లాడామని మహేశ్ గౌడ్ చెప్పారు.

### మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు పరిశీలకులు

మునిసిపల్ ఎన్నికలు లేని జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సేవలను ఈ ఎన్నికల్లో వాడుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఎన్నికలు లేని గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ వంటి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లను ఎన్నికలు జరుగుతున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు పరిశీలకులుగా పంపనున్నట్లు మహేశ్‌గౌడ్ వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో కోర్సును పూర్తి చేసిన సీఎం రేవంత్‌ను మంత్రులు సన్మానించారు.

### నేడు మిర్యాలగూడకు సీఎం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం బహిరంగ సభ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరద్‌చంద్ర పవార్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

### బందోబస్తుకు వెళ్తూ.. ఇద్దరు కానిస్టేబుళ్లకు ప్రమాదం

సీఎం బందోబస్తు విధులకు వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మదార్, సుర్ఘష తమ బైక్‌పై సీఎం సభాస్థలికి బయలుదేరారు. ఈదులగూడ చౌరస్తా వద్దకు చేరుకోగానే, వెనుకనుంచి వచ్చిన కంటైనర్ లారీ వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మదార్ ద్విచక్రవాహనం పైనుంచి ఎగిరిపడటంతో తలకు బలమైన గాయమైంది. మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. సుర్ఘషకు స్వల్ప గాయాలయ్యాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

## ప్రతిపైసనూ లెక్కించనున్న అధికారులు

**నిజామాబాద్,ఫిబ్రవరి 3 :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్దులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వ హిస్తున్నారా? ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీ ఖర్చులో చూపించారా?, సోష ల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ఫ్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడం తో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితి పై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సోషల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక కూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను నియమించుకోవచ్చు!

**కొత్త నియామకాలకు పాత ఆదేశాలు అడ్డంకి కాదు..**

**మంత్రివర్గ సిఫారసులపై గవర్నర్ స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చు**

**తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై సుప్రీం స్పష్టత**

**అలీఖాన్ ఏఐని ఇతర పిటిషన్లకు జత చేసిన న్యాయస్థానం**

**తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా**

**న్యూఢిల్లీ :** తెలంగాణలో గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కోటా కింద తదుపరి ఎమ్మెల్సీల నియామకానికి గత ఆదేశాలు అడ్డంకి కాబోవని స్పష్టం చేసింది. అలాగే, కొత్త ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి మంత్రివర్గం సిఫారసు చేసిన పేర్లపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే అధికారం గవర్నర్‌కు ఉంటుందని తేల్చిచెప్పింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణల నియామకాన్ని రద్దు చేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణల తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్, తెలంగాణ ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్ దేవినా సెహగల్, న్యాయవాది గౌరవ్ అగర్వాల్, కోదండరాం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. సుప్రీంకోర్టు గత ఆదేశాలతో ఎమ్మెల్సీగా తన నియామకం రద్దయిందని, తనను మళ్లీ ఎమ్మెల్సీగా నియమించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అమీర్ అలీఖాన్ కూడా పిటిషన్ వేశారు. ఆయన తరఫున న్యాయవాది సంజయ్ ఇంప్లీడ్ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశారు. ఈ



విషయాన్ని ధర్మాసనానికి తెలియజేశారు. ఈ క్రమంలో నిరంజన్‌రెడ్డి కలుగజేసుకుని.. ఇకపై గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాలకు కొత్త పేర్లను ప్రతిపాదించేందుకు మార్గం సుగమం చేయాలని, అందుకు మంత్రివర్గానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై కోర్టు గత ఆదేశాలు, గవర్నర్ అధికారాలు తదితర అంశాలను ప్రస్తావించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొంత అస్పష్టత నెలకొందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. "సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో అస్పష్టత ఎందుకు ఉంటుంది? గవర్నర్ కోటాలో కొత్తగా చేపట్టబోయే ఎమ్మెల్సీ నియామకాలకు కోర్టు గత ఆదేశాలేమీ అడ్డంకి కాదు. ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి మంత్రివర్గం సిఫారసు చేయొచ్చు. ఆ విషయంలో నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్‌కు పూర్తిగా స్వేచ్ఛ ఉంటుంది" అని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. అలాగే, అలీఖాన్ దాఖలు చేసిన ఏఐతోపాటు అన్ని పిటిషన్లను కలిపి విచారిస్తామని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ అవసరమన్నారు. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేశారు.

### కేసు పూర్వాపరాలివీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా.. రాజకీయ నేపథ్యం ఉందంటూ నాటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని ఇద్దరూ హైకోర్టులో సవాల్ చేశారు. ఆ కేసు నడుస్తుండగానే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 జనవరి 13న కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం సిఫారసు చేయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. అయితే, వారి నియామకాన్ని సవాలు చేస్తూ దాసోజు, సత్యనారాయణ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత 2024 మార్చి 17న హైకోర్టు సీజే ధర్మాసనం.. గవర్నర్ ఉత్తర్వులను రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీలుగా కోదండరాం, అలీఖాన్‌ల పేర్లను మంత్రివర్గం మరోసారి సిఫారసు చేయగా, గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ దాసోజు, సత్యనారాయణలు 2024 ఆగస్టు 4న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల తర్వాత కోదండరాం, అలీఖాన్‌ల నియామకాన్ని కోర్టు రద్దు చేసింది. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కోదండరాంకు మళ్లీ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. దీంతో తనను కూడా ఎమ్మెల్సీగా నియమించేలా ఆదేశాలివ్వాలంటూ అలీఖాన్ సుప్రీంను ఆశ్రయించగా.. అన్ని పిటిషన్లను కలిపి విచారిస్తోంది.

# రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

## నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది

## తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ

## ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

## వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

## అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మేడారం జాతర విజయవంతం

## ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం

## ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి

## మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క



**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

# సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

## ఉచితాలను ప్రకటించడానికి కాదు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

## జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట

## కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి

**జగిత్యాల,ఫిబ్రవరి 3 :** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనుసన్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

# పదేళ్ల పాటు నిరుద్యోగుల ఉసురుపోసుకున్న బిఆర్ఎస్

## కాంగ్రెస్ వచ్చాకే నియామకాలు చేపట్టిన సిఎం రేవంత్

## బిఆర్ఎస్ దొంగ ఏడుపులపై మండిపడ్డ ఎమ్మెల్సీ బల్మూరి

**హైదరాబాద్,ఫిబ్రవరి3 :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై మండిపడ్డారు బల్మూరి వెంకట్. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్ వర్డ్ రిజిస్ట్రార్లు ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామంటూ.. ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు.

# సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ



హైదరాబాద్,ఫిబ్రవరి 3 : డా. బి.ఆర్. అంబెడ్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యా లతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

## వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ

## ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

## మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం




**న్యూఢిల్లీ:** ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు. 2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

# భారత్.. రష్యా వ్యూహాత్మక భాగస్వామి

## చమురు దిగుమతులపై చర్చ జరగలేదు

## చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం

## డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా

**న్యూఢిల్లీ:** అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం వేళ రష్యా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ స్పందించింది. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పరోక్షంగా వెల్లడించారు. ఈ అంశంపై న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయని పెస్కోవ్ పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ తన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుందని రష్యా విశ్వాసం వ్యక్తం చేసింది. ఇటీవల మోదీతో జరిపిన ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేస్తామని మోదీ తనకు మాటిచ్చారని ట్రంప్ ప్రకటించారు. తాము జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఇది అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. అయితే ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే రష్యా నుంచి ఈ వివరణ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. భారత్ వంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోందని పెస్కోవ్ ఆరోపించారు. వాషింగ్టన్ నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నా న్యూఢిల్లీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఉంటాయని రష్యా బలంగా నమ్ముతోంది. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని, ఎలాంటి మార్పులు ఉంటే దౌత్య మార్గాల్లో సమాచారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, భారత్ తక్కువ ధరకు రష్యా ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యా నుంచే తీరుతున్నాయి. ఈ వాణిజ్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు, రష్యాకు కూడా ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో చమురు కొనుగోళ్లు ఆపేయడం అంత సులభం కాదని, ఇది కేవలం ట్రంప్ రాజకీయ విన్యాసాల్లో భాగం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మన సహనమే విజయానికి బాట

## విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

## అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది

## అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

## ఎన్డీఏ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపీలు



**న్యూఢిల్లీ :** ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

# ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

## మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు

## ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది

## అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ :** అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్స్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

# రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

## అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు

## లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా



**న్యూఢిల్లీ :** ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ, వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. మరోవైపు కాంగ్రెస్ నేతలు పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్ష, అధికార పక్షాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ఇకపై పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన ప్రశ్నలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

# భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

## పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారు

## భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని పేర్కొన్న రోహిత్.. మంచు ప్రభావం వల్ల ముగ్గురు స్పిన్నర్లతో ఆడటం రిస్క్ అని హెచ్చరించారు. వికెట్ తీయగలిగే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో కుల్దీప్ యాదవ్‌పై సరదాగా వ్యాఖ్యానిస్తూ, "గల్లీ క్రికెటర్‌లా ప్రతి బంతికి అప్పీల్ చేయొద్దు, రివ్యూల విషయంలో నేను కుల్దీప్‌ని నమ్మను" అని చమత్కరించారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ఈ టోర్నీలో భారత జట్టు విజయం సాధించాలని రోహిత్ ధీమా వ్యక్తం చేశారు.







# తారాజువ్వలా ఇషాన్ కిషన్

## గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్

## టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?

## అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

# డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

## సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి

మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్?కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్?కే ఫ్రాంఛైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంఛైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంఛైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంఛైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.




# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

## వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు

## ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్

ఐసీసీ టీ - 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్-ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్-ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్--పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ లేకపోతే ప్రకటనల ద్వారా రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 10 సెకన్ల ప్రకటనకు రూ.40 లక్షల వరకు వసూలు చేసే స్థాయిలో ఈ మ్యాచ్‌కు ఆదరణ ఉంది.మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, మహమ్మద్ యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్, మొహ్సిన్ ఖాన్ లాంటి పలువురు మాజీ క్రికెటర్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో, పాకిస్తాన్ తుది నిర్ణయం ఏవిధంగా ఉంటుందన్నది అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిగా మారింది.



మానేరు
జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక






# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

## రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు

బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృద్వీ రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు- ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్టిబ్యూష్రన్ రైట్స్ కోసం డిస్టిబ్యూట్రర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్టిబ్యూష్రన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.

# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్



గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్దానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.



# పీఆర్‌పై పెద్దగా ఆధారపడను : రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



# మాళవిక సోయగాలు అదరహో!

ఈమధ్య కాలంలో వెరైటీ ఇండియా రూపొందిస్తున్న ఫ్యాషన్ దుస్తులతో హీరోయిన్స్ తమ అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా వెరైటీ డ్రెస్ లతో ఫ్యాషన్ ప్రియులకు మరింత స్పెషల్ అట్రాక్షన్ గా కనిపిస్తున్నారు. ఇందులో బాగానే మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ కూడా తాజాగా వెరైటీ ఇండియా డిజైన్ చేసిన బ్లాక్ అవుట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇటీవలే రకుల్ ప్రీత్ సింగ్ వెరైటీ డ్రెస్ తో మెస్మరైజ్ చేయగా.. ఇప్పుడు మాళవిక కూడా అలాంటి తరహా డ్రెస్ లోనే ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. టాప్ ట్రెండీ ఔట్ ఫిట్ ధరిస్తూనే.. బాటమ్ చీరకట్టులో కనిపిస్తూ సరికొత్తగా కనిపించింది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటుంది ఈ ఔట్ ఫిట్. ఇక చేతులకు గోల్డెన్ కడ ధరించి తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మలయాళ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈమె తొలిసారి తెలుగులో ప్రభాస్ హీరోగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ది రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో మాళవికతో పాటు రిద్దీ కుమార్, నిధి అగర్వాల్ కూడా హీరోయిన్లుగా నటించారు. ఇకపోతే భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా మాత్రం ఏడాది సంక్రాంతి బడిలో నిలిచి డిజాస్టర్ గా నిలిచింది. అయినా సరే మాళవిక మోహనన్ కి మాత్రం మంచి గుర్తింపు లభించిందని చెప్పవచ్చు. ఇకపోతే ఈమె ఎవరో కాదు ప్రముఖ మలయాళ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్.. 2013లో వచ్చిన మలయాళ చిత్రం పట్టంపోల్ సినిమా ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. ఇక తర్వాత ది గ్రేట్ ఫాదర్ , పెట్ట , మాస్టర్ , హృదయపూర్వం వంటి సినిమాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈమె 1993 ఆగస్టు 4న కేరళలోని కన్నూరు జిల్లాలోని పయ్యనూరు పట్టణంలో జన్మించింది. కానీ ముంబైలో పెరిగింది. ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమా సీక్వెల్ సర్దార్ 2లో నటిస్తోంది. తమిళ భాష పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. రత్నకుమార్ , ఆశామీరా అయ్యప్పన్ , విగ్నేష్ మునియాండి రచన , నంబి స్క్రీన్ ప్లే అందించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. ఇందులో కార్తీక్, రజీషా విజయన్ తో పాటు మాళవిక మోహనన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితోపాటు ఆషికా రంగనాథ్, ఎస్ జె సూర్యా కూడా ఈ సర్దార్ 2 లో భాగం కానున్నారు. 2024 జూలైలోనే షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమా ఈ ఏడాది జూన్లో విడుదల కానున్నట్లు సమాచారం.

# బీఆర్ఎస్ భూ రాక్షసుల సమితి

## కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు



కరీంనగర్, జనతా న్యూస్: బీఆర్ఎస్ పార్టీని భూ రాక్షసుల సమితిగా అభివర్ణించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పదేళ్ల పాలనలో కనబడిన భూములన్నింటినీ కబ్జా చేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తే ప్రజల ఇళ్లను కూడా కబ్జా చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పాలనలో కమీషన్లు దండుకుని కేంద్ర నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. ఎవరి పొట్ట కొట్టాలి, ఎట్లా పైసలు సంపాదించాలన్నదే బీఆర్ఎస్ నేతల ధ్యాసగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించిన ఆయన, ప్రభుత్వం వద్ద నిధులు లేవని, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, అలాంటి కాంగ్రెస్ నేతలు ఓట్ల కోసం వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని ప్రశ్నించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ప్రధాని మోదీని ఒప్పించి పెద్ద ఎత్తున నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ అభివృద్ధికి ఇప్పటివరకు వచ్చిన నిధులన్నీ కేంద్రం నుంచే వచ్చాయని చెప్పారు. తాను తెచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో బుక్‌లెట్ ముద్రించి ఇంటింటికీ పంపుతున్నానని, అందులో తప్పులు ఉంటే తనపై కేసు పెట్టవచ్చని సవాల్ విసిరారు. అల్కాపురి కాలనీ, పెద్దపోచమ్మ ఆలయ రోడ్, కోతి రాంపూర్ నుంచి కట్టరాంపూర్ వరకు రోడ్ల అభివృద్ధి స్మార్ట్ సిటీ నిధులతోనే జరిగిందని వివరించారు. డంపింగ్ యార్డ్ సమస్యకు బీఆర్ఎస్ ప్రధాన కారణమని, కేంద్రం నుంచి నిధులు తెచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావుతో పాటు 9, 39, 40 డివిజన్ల బీజేపీ అభ్యర్థులు బండారు గాయత్రి, పసుపులేటి శివానందం, కాసర్ల లక్ష్మీ నర్సవ్వ పాల్గొన్నారు. ఈ మూడు డివిజన్లలో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బండి సంజయ్ ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మూడో స్థానం కోసం పోటీ జరుగుతోందని, కరీంనగర్ అభివృద్ధి కోసం నిజంగా పోరాడేది బీజేపీ ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు: డాక్టర్ మేడిపల్లి సత్యం



కరీంనగర్, జనతా న్యూస్। ఫిబ్రవరి 03, 2026: రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే నిలుస్తున్నారని, అందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలే నిదర్శనమని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం కరీంనగర్ నగరంలోని వి--పార్క్ హోటల్‌లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 5న చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ముగ్గురు మంత్రులు హాజరవుతారని చెప్పారు. గుమ్లాపూర్ గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభమవుతుందని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. గత రెండు సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రానున్న మూడు సంవత్సరాల్లో చేయనున్న పనులపై ముఖ్యమంత్రి ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు నిర్ణయించుకున్నారని చెప్పారు. ఈ సభకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేషన్, లైబ్రరీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు హాజరవుతారని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినప్పటి నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయ పరంపర కొనసాగుతోందని అన్నారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సున్నా సీట్లకే పరిమితమైందని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ మేయర్ స్థానం దక్కకుండా కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రహస్య మైత్రితో అభ్యర్థులను బరిలో నిలిపి కాంగ్రెస్‌కు సీట్లు రాకుండా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో భూమాఫియాకు పాల్పడి అరెస్టయిన వారు మళ్లీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్లు ఆశించడం తప్పు కాదని, కానీ పార్టీ అధికారికంగా బీ--ఫారం ఇచ్చిన అభ్యర్థులకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పుడూ కాపాడుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం: ఎన్నికల సాధారణ పరిశీలకులు జితేందర్ రెడ్డి



కరీంనగర్, జనతా న్యూస్: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్న విధానాన్ని మైక్రో అబ్జర్వర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ బూత్ లోపల, బయట జరుగుతున్న ప్రతి అంశాన్ని నిరంతరం గమనించాలని అన్నారు. విధుల నిర్వహణ సమయంలో తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు రోజు మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని మాక్ పోలింగ్ ప్రక్రియ, ఓటింగ్ నిర్వహణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం తదితర అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ సరళిని ఉన్నతాధికారులకు తెలియజేయాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సమాచారం అందించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల ఆడిట్ అబ్జర్వర్ ఎం. మనోహర్, నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహినుద్దీన్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పోటీలకు బధిర విద్యార్థులను సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్, జనతా న్యూస్: అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సిద్ధం చేయాలని, అందుకు అవసరమైన అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బధిర విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపర్చేందుకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. గత నెల 29 నుంచి ఈ నెల 1 వరకు ముంబైలో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "ది సైలెంట్ ఒలింపియాడ్--2026" జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొని "ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్"గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో విద్యార్థులు మొత్తం 28 బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. జాతీయ స్థాయిలో బధిర విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చాటారని ప్రశంసించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ వివిధ దేశాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వీరిని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం మరింత శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని, అవసరమైన వసతులు, మద్దతు జిల్లా యంత్రాంగం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి. కమల ఉదయ కుమారి, ఉపాధ్యాయులు జే. తులసీరామ్, కె. శ్రీనివాస్, ఎన్. సుజాత, బి. అఖిల్, ఎం. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడల్లో లక్ష్మీపూర్ క్రీడాకారుడి ప్రతిభ



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో నిర్వహించినటువంటి మండల స్థాయి సీఎం కప్ క్రీడల పోటీలో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాటి చెట్టు మారుతి ప్రసాద్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్ వంద మీటర్లు, మరియు 200 మీటర్ల రన్నింగ్ పోటీలో మండల స్థాయిలో మొదటి మూడు బహుమతులు గెలుచుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అథ్లెటిక్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో గ్రామ గౌరవాన్ని నిలిపిన క్రీడాకారున్ని మంగళవారం గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ రెడ్డి లు గ్రామస్తులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మున్ముందు జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో క్రీడల పోటీల్లో పాల్గొని మరెన్నో బహుమతులు గెలుచుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుతి ప్రసాద్ ను ఆదర్శంగా తీసుకొని గ్రామంలోని యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంగాధర హరీష్, వార్డు సభ్యులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, బోనగిరి తిరుమల, ముక్కిస శ్రీనివాస్ రెడ్డి, చిలువేరు రాజిరెడ్డి, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బోనగిరి శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పౌష్టికాహార కేంద్రాలు అంగన్వాడి సెంటర్

**కళ్లపెల్లి సర్పంచ్ బిగుల్ల మోహన్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని కళ్ళపెల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ లో నిర్వహించినటువంటి పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి మంగళవారం గ్రామ సర్పంచ్ బిగుల్ల మోహన్ హాజరై గుడ్లు, బాలామృతం గర్భిణీలు, బాలింతలు, చంటి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లు పౌష్టికాహార కేంద్రాలుగా నిలుస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని రక్తహీనత, పోషకాహార లోపం, ఐరన్ లోపం మొదలగు రుగ్మతలకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బుర్ర వినీత్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు అనురాధ, కమిటీ మెంబర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# పాతగుట్ట బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

## అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

## నేటి నుండి ఆర్జిత సేవలు పునరుద్ధరణ



యాదగిరిగుట్ట : యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలోని పాతగుట్ట(పూర్వగిరి) శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం ఉదయం నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకంతో గత వారం రోజులుగా జరుగుతున్న ఉత్సవాలకు ఆలయ అర్చకులు పరిసమాప్తి పలికారు. జనవరి 28న స్వస్తివాచనం, పుణ్యాహవచనంతో మొదలైన బ్రహ్మోత్సవాలు మంగళవారం చేపట్టిన అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిశాయి. ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, పారాయణికుల వేదపారాయణాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకాన్ని వైభవోపేతంగా జరిగింది. ఉత్సవాల ముగింపులో భాగంగా 108 కలశాలను వరుస క్రమంలో పేర్చి, 108 కలశాల్లో ఫల, పుష్ప, రస, గంధ, జలానికి ప్రత్యేక పూజలు చేసి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. అనంతరం అట్టి జలంతో స్వామిఅమ్మవార్లకు అభిషేకం చేశారు. యజ్ఞాచార్యుల మూల, మూర్తి మంత్రాలు, సన్నాయి మేళతాళాల హోరులో స్వామిఅమ్మవార్ల అష్టోత్తర శతఘటాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవానీ శంకర్, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, జూషెట్టి కృష్ణ గౌడ్, మహేష్, ఆలయ సిబ్బంది పాల్గొని పూజలు చేశారు. అనంతరం టెంపుల్ ఆఫీసర్లకు మహదాశీర్వచనం.. వేదబ్రాహ్మణులు, యజ్ఞాచార్యులు, పారాయణికులకు, పండితులకు పండిత సన్మాన కార్యక్రమాలు జరిగాయి. దీంతో వారం రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు.



### ఆర్జిత సేవలు పునరుద్ధరణ

పాతగుట్ట నరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు, వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జనవరి 24 నుండి తాత్కాలికంగా రద్దు చేయబడిన ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం వంటి పూజలు బుధవారం నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. మంగళవారంతో ఉత్సవాలు ముగియడంతో బుధవారం నుండి ఆర్జిత సేవలను తిరిగి పునరుద్ధరించనున్నారు.

# విద్యార్థుల ప్రయోగాలు ప్రజల వినియోగం వరకు చేరాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనతా న్యూస్: విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు కేవలం సైన్స్ ఫెయిర్లకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే వినియోగ వస్తువులుగా మారాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేయాలని, వాటిని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కుమార్వాడి)లో నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌లో కరీంనగర్ జిల్లాకు చెందిన 17 పాఠశాలలు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 8 పాఠశాలల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో జరిగే ఎగ్జిబిషన్లకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అవగాహన, కోతుల సమస్యకు పరిష్కారం వంటి అనేక అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ప్రశంసనీయమని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 35 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోగాలను శాశ్వతంగా ప్రదర్శించేందుకు, మరిన్ని సైన్స్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కరీంనగర్‌లో జిల్లా సైన్స్ మ్యూజియంను అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆ మ్యూజియంలో అటల్ టింకరింగ్ ల్యాబ్, రోబోటిక్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు రూపొందించిన వస్తువులు వినియోగానికి అనుకూలంగా మారి సమాజానికి ఉపయోగపడాలని, అందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, యూనిసెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గిరిజాశంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

హైదరాబాద్,ఫిబ్రవరి 3(ఆర్ఎన్ఎ): వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

# వరంగల్ జూలో తెల్లపులి మృతి

### వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

**వరంగల్,ఫిబ్రవరి 3 :** నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

# అధ్వాన్న రోడ్డు దుస్థితిపై ఆందోళన

### మూకుమ్మడిగా గ్రామస్థుల నిరసన ధర్నా

జనగామ,ఫిబ్రవరి 3 : రోడ్డు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ పట్టించుకోక పోవడంపై గ్రామంలోని యువత ఏకమయ్యింది. సమస్యపై ధర్నాతో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చింది. జనగామ జిల్లాలోని కొడవటూరు కమాన్ క్రాస్ నుంచి బచ్చన్నపేట ఎస్సార్ పెట్రోల్ బంక్ వరకు గుంతలమయంతో అధ్వానంగా మారిన జనగామ- సిద్దిపేట రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం భారీ రాస్తారోకో ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు నిర్వహించిన ధర్నాలో జనగామ, ఆలేరు, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడెక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ప్రతిరోజు ఎంతోమంది ఈ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని అన్నారు. బైకులపై వెళ్లిన పలువురు యువకులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు పత్రికల ద్వారా సమస్యను విన్నవించిన కూడా అధికార యంత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవ రిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారి షాపుల్లోకి విపరీతంగా దుమ్ము వెళ్లడంతో వారు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. మాస్క్ పెట్టితేనే షాపు తెరవాలే తప్ప, వేరే మార్గం లేదన్నారు. కలెక్టర్ రావాలి. రోడ్డు నిర్మాణం పై హామీ ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా విరమించాలని ఎస్ఐ హమీద్ కోరిన వారు వినలేదు. జిల్లా స్థాయి అధికారులు రావాలి, తమకు కచ్చితంగా హామీ ఇవ్వాలి అంటూ మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ హుస్సేన్ రాస్తారోకో వద్దకు వచ్చి, రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి, పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ÷ట్ ఫర్ బచ్చన్నపేట యూత్ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యూరియా యాప్‌తో తొలగిన కష్టాలు

### వెల్లడించిన వ్యవసాయ శాఖ

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** యూరియా సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా, నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతోందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. గతంలో యూరియా సరఫరాలో చోటు చేసుకున్న బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపకల్పన చేశారు. జిల్లా యూనిట్‌గా యూరియా బుకింగ్ విధానం అమలు చేయడం ద్వారా, స్థానిక అవసరాల ఆధారంగా సరఫరాను నియంత్రిస్తూ, ప్రతి రైతుకు న్యాయమైన వాటా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యూరియా యాప్ ద్వారా పంటల వారీగా అవసరమైన పరిమాణానికే బుకింగ్ జరుగుతుండటంతో, నిజమైన రైతులకే ఎరువులు చేరుతున్నాయి. ÷ౌరియా యాప్ అనేది కేవలం ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదు అది, నిజమైన రైతులకు యూరియా అందించేందుకు,ళారుల ప్రమేయం మరియు బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు, సరఫరా వ్యవస్థలో పారదర్శకతకు ప్రభుత్వం తీసుకున్న సంస్కరణాత్మక చర్య. ఎప్పటికప్పుడు మండల స్థాయి మొదలుకుని ఉన్నత స్థాయి అధికారులు రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఈ యాప్ పైన రైతుల అభిప్రాయాలు తీసుకుంటూ దానికి తగ్గట్టు మార్పులు చేస్తూ ఇప్పటికి 22 జిల్లాలో అమలు చేస్తున్నారు.

# మిట్టపల్లిలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## భోజన నాణ్యత, పరిశుభ్రతపై కఠిన ఆదేశాలు

సిద్దిపేట, జనతా న్యూస్ : సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్నం, గుడ్డు, క్యాలీఫ్లవర్ కూర, పప్పు, రసం, పెరుగులను తనిఖీ చేశారు. భోజనం తప్పనిసరిగా డైనింగ్ హాల్‌లోనే వడ్డించాలని, ఇతర ప్రాంతాల్లో వడ్డించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం లేదా కూరలు కోరినప్పుడు వారు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందికి ఆదేశించారు. కామన్ డైట్ మెనూను కచ్చితంగా పాటిస్తూ, నాణ్యమైన మరియు రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులు కడుపునిండా తినేలా వండించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది మరియు పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఈగలు, దోమలు రాకుండా డెటాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. తదుపరి కేజీబీవీ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూరల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, నిర్లక్ష్యంగా వంట చేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి అందించాలని సిబ్బందిని ఆదేశించారు. డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com